# ఉద్యోగ వేట

సత్తయ్య ఒక చిన్న డిపార్ట్‌మెంట్‌లో అటెండర్‌గా పనిచేసేవాడు. డిపార్ట్‌మెంట్ అంటే ఒక ప్రభుత్వ శాఖ కానీ, ఒక ఉపశాఖ కానీ కావచ్చు. చిన్న డిపార్ట్‌మెంట్ అన్నప్పుడు అది ఉపశాఖే కావాలి. ఈ చిన్న డిపార్ట్‌మెంట్‌కి కూడా ఒక అధిపతి ఉంటాడు... హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్. వారి ఆఫీసుని డిపార్ట్‌మెంట్ వాళ్ళు హెడ్డాఫీసు అంటారు. నాలుగైదు జిల్లాలకు ఒకరు చొప్పున వారికింద రీజనల్ ఆఫీసర్స్ ఉంటారు. వాళ్ళకింద జిల్లాకొక అధికారి ఉంటాడు. ప్రతి జిల్లాలో ప్రభుత్వ వాహనాలు ఉంటాయి. ఈ రకంగా డిపార్ట్‌మెంట్ గురించి వివరణ ఇంకా కొనసాగిస్తే చదివేవాళ్ళకి బోరు కొడుతుంది. సత్తయ్య హెడ్డాఫీసులో అటెండర్‌గా పనిచేస్తూఉండగా రెండు పబ్లిక్ హాలిడేస్ తరువాత వచ్చిన ఒక పనిరోజున అతను ఆఫీసుకు హాజరు కాలేదు. కానీ, ఉద్యోగ విధుల నిర్వహణలో అరకొరలు లేని అతని శెలవు చీటీ ఆరోజు ఉదయమే అతని కొడుకు ఆనంద్ పట్టుకొచ్చి ఇచ్చాడు. సత్తయ్య ఆ డిపార్ట్‌మెంట్ హెడ్డయిన మల్లికార్జున రావు గారి పర్సనల్ అటెండర్. అతను ఒకరోజు రాకపోయినా, మల్లికార్జునరావుకు ఆఫీసులో గడవదు. ఆయనకి కావాల్సినప్పుడు కాఫీలు, టీలు అందించడం, సందర్శకులని స్క్రీన్‌చేయడం, కరెంట్‌పోయినపుడు ఒక్క నిమిషమైనా ఆలస్యం చేయకుండా, ఆ ఎయిర్ కండిషన్డ్ రూమ్ లోపలికి వెళ్ళి కిటికీలు తెరవడం, కరెంటు రాగానే కిటికీలు మూసి వెయ్యడం, ఇత్యాది అన్ని పనులు ఎవరి ఆదేశాల గురించి ఎదురు చూడకుండానే చేసేవాడు. మల్లికార్జునరావుగారి టేబిల్‌మీద ఎప్పుడూ ఒక గ్లాసు నిండా మంచినీళ్ళు ఉండేవి. ఆయన ఆ గ్లాసులో నుంచి రెండు గుక్కల నీళ్ళు తాగితే చాలు, సత్తయ్య వెంటనే దానిని నింపిపెట్టేవాడు. అనవసరంగా అతను ఆ గదిలో ఒక్క నిముషమైనా ఉండేవాడు కాదు. కానీ, కాలింగ్ బెల్ మోగితే చాలు, సత్తయ్య గదిలో ప్రత్యక్షమయ్యేవాడు. అనవసరంగా అతను ఎప్పుడూ మాట్లాడేవాడు కాదు. ఏ విషయమయినా అతనికి ఒక్కసారి చెబితే చాలు, ఇక రెండోసారి చెప్పే అవసరముండేది కాదు.

పెద్దాయన ఏదయినా చెప్పడం మొదలు పెట్టేలోగానే సత్తయ్య పూర్తి వివరాలు గ్రహించగలిగేవాడు. ఆయన ఇంట్లో ఏదయినా పని ఉంటే, అది రాత్రి కానీయండి, పగలు కానీయండి, పనిరోజులైనా సరే, సత్తయ్య పరుగెత్తి వెళ్ళేవాడు. మల్లికార్జునరావు సతీమణి కూడా సత్తయ్యని మెచ్చుకునేది. ఆయన ఆఫీసుపనిలో తలమునకలై ఉన్నప్పుడు కానీ, సెక్రటేరియట్‌కి మరే ఆఫీసుకు కానీ వెళ్ళినప్పుడు, ఇంటి అవసరాలకు ఏమయినా కావాలంటే,

మిసెస్ మల్లికార్జునరావు సత్తయ్యకు ఫోన్ చేస్తే చాలు, నిమిషాలమీద అతను ఆ పని సాధించుకొస్తాడు. ఆ విధంగా చిన్న చిన్న విషయాలకు తన భర్తను విసిగించక్కరలేదని ఆమె అనుకొనేది. మల్లికార్జునరావుకి కానీ, అతని భార్యకి కానీ అతని సేవలు అందని రోజులు దుర్భరంగా ఉండేవి.

"సత్తయ్యకి ఏమైంది?" అని అడిగారు మల్లికార్జునరావు.

"మా నాన్నకి శనివారం జ్వరం వచ్చింది. అది ఇంతవరకూ తగ్గలేదు." అని ఆనంద్ జంకుతూ వినయంగా జవాబిచ్చాడు. "డాక్టర్ దగ్గరికి వెళ్ళలేదా?"

"లేదు సార్, ఇంటి దగ్గర ఒక వైద్యుడు వచ్చి చూసి మందులిచ్చాడు. కానీ, ఫలితమేమీ కన్పించలేదు. చాలా తలనొప్పి కూడా ఉన్నట్టుంది. ఆయన మూసిన కళ్ళు తెరవడం లేదు. మాట్లాడటం లేదు" అని ఆ అబ్బాయి కొంచెం కంగారుగా చెప్పాడు.

"ఇక ఆలస్యం చెయ్యకుండా ఒక డాక్టర్‌కి చూపించాలి" అంటూ ఆయన కిందనున్న ఆఫీసర్‌ని పిలిచి ఫలానా డాక్టర్‌ని ఒక జీపులో సత్తయ్య ఇంటికి తీసుకు వెళ్ళమని ఆదేశించాడు. ఆ ఆఫీసర్‌తో పాటు ఆనంద్ కూడా జీపులో వెళ్ళాడు. రోగిని పరీక్షించిన తరువాత డాక్టరు ఒక ఇంజక్షన్ ఇచ్చాడు కానీ, వెంటనే అతన్ని ఆసుపత్రిలో చేర్చమని సలహా ఇచ్చాడు. అదే జీపులో సత్తయ్యని గాంధీ హాస్పటల్‌కి తీసుకువెళ్ళి అడ్మిట్ చేయించాడు, మంచివాడైన ఆ డాక్టర్. మల్లికార్జునరావు ఇంటికి రాగానే భార్యతో ఈ విషయాన్ని గురించి చెప్పాడు.

"అయ్యో పాపం సత్తయ్య, ఉట్టి జ్వరమే కదా ఏదయినా మందిస్తే తగ్గిపోతుంది" అని సావిత్రి సంతాపం ప్రకటించింది.

"అతను ఈ రోజే హాస్పటల్‌లో అడ్మిట్ అయ్యాడు. నువ్వు చూస్తుండు రెండురోజుల్లోపలే అతను ఆఫీసుకు వచ్చేస్తాడు ఒక్కరోజు కూడా ఆఫీసుకు రాకుండా ఉండటం అతని వల్లకాదు."

"అతని మనస్తత్వం అటువంటిది. కాని, అతను మీకు రెండో భార్యే కదా! ఆ రెండో భార్య లేకుండా ఒకరోజు గడపాలంటే..."

"అతన్ని రెండో భార్య అని అనడం చాలా అన్యాయం. నేను చెప్పినట్టు వినేవాడికి భార్య అనే పేరుపెట్టి అపహాస్యం చేయకూడదు."

"అంటే?"

"ఎంతకాలం సహవాసం చేసినా కూడా విధేయతా లక్షణాలు అలవడని వ్యక్తే కదా

భార్య! ఇతను అలా కాదు... పూర్తిగా నా హితానువర్తి. నేను మనసులో అనుకున్న విషయాలు కూడా గ్రహించుకొని అతను ప్రవర్తిస్తాడు."

"అయితే నేను మీ మాట విననా మీ ఉద్దేశ్యం" అని శ్రీమతి చిఱ్ఱుబుఱ్ఱులు.

"అలా కోపగించుకోకు సావిత్రీ! చెప్పినపనల్లా అతను చేసినట్టు నీకు చేయడానికి వీలవుతుందా? నేను చెప్పేదేదయినా అది వేదవాక్కుగా భావిస్తాడు. నీలాగా నేను చెప్పేవాటన్నిటికీ సవరణలు చెయ్యడానికి గానీ, ఎదురు చెప్పడానికి గానీ అతనికి ధైర్యం ఉందా?"

"అంటే మీకు అతనంటేనే ఎక్కువ ఇష్టం అన్నమాట?"

"ఓసి వెర్రి మొహమా! నేను నీ కింద పనిచేయడం మొదలు పెట్టి ఇరవై ఏళ్ళు పైనే అయింది కదా! మనకిప్పుడు కాలేజీకి వెళ్తున్న ఇద్దరబ్బాయిలు ఉన్నారు. అయినా నీకింత వరకు తెలియలేదా, నాకెవరంటే ఎక్కువ ఇష్టమో! ఈ డిపార్ట్‌మెంట్‌కి వచ్చి ఒకటిన్నర సంవత్సరం కూడా కాలేదు. అప్పట్నుంచే కదా, సత్తయ్య నా దగ్గర పనిచేస్తున్నాడు. మహా అయితే మరో సంవత్సరంన్నర నా దగ్గర ఇంకా పనిచేస్తాడేమో! తరువాత నాకు ఎలాగు ట్రాన్స్‌ఫర్ అవుతుంది. అప్పుడు నువ్వు అన్నట్లు నేనింకో రెండో భార్యను సంపాదించుకోవాలా?"

"మీరేమన్నా సరే, ఈ మగవాళ్ళకి బయటి ఆడవాళ్ళంటే ఎలాగూ మోజే. పొరుగింటి పుల్లకూర రుచి."

"సావిత్రీ! మా సర్వీసే అలాంటిది. ఐ.ఏ.యస్.ను తెలుగులో ఎలా అంటారో తెలుసా? ఇతర ఆడవాళ్ళకు సేవ. నీకు తెలుసు కదా! ప్రభుత్వ ఉద్దేశ్యం ఏమిటంటే, పాలన ప్రజల వద్దకు తీసుకువెళ్ళాలని. అందుకే, చాలమంది మహిళల అవసరాల గురించి, ఫిర్యాదుల గురించి శ్రద్ధ తీసుకోవడం మా కర్తవ్యం."

"మొదట్నించీ మీకు ఐ.ఏ.యస్. వాళ్ళపట్ల కొంచెం ఈర్ష్య. అది నాకు తెలుసు. అయితే, మీరు ఒక డైరెక్ట్ రిక్రూట్ అయి ఉంటే, ఐ.ఏ.యస్.కు ఇలాంటి వ్యాఖ్యానం ఇచ్చి ఉండేవారు కాదు."

"అయ్యో భామా! ఈ మాత్రం సరసోక్తులకు కూడా నేను నోచుకోలేదా! ఇంతకీ నేను చెప్పబోయే దేమిటంటే, నాకు రెండో భార్య అనే ఆలోచనే నచ్చదు. నా ప్రాణానికి నువ్వు ఒక్కత్తివే ఎక్కువ. నేను మల్లికార్జునరావు బదులు అర్జునరావు అయి ఉంటే నిన్ను పెళ్ళాడగానే,

నీ భారం వహించడానికి నాకు సహాయంగా మరో నలుగురు వుండేవారు. కాని అలా జరిగి ఉంటే, బహుశా మంచి ఒడ్డు, పొడుగూ ఉన్న భీముడు నీకు నచ్చేవాడేమో కదా!"

"మహాభారత కథలో అలా కాదే. ద్రౌపదికి పక్షపాతం అర్జునుడిపట్లే ఉండేది."

"ఏదైనా, నీకు సావిత్రి అని పేరు పెట్టడం నా అదృష్టం. ఆమె సత్యవంతుడిని మాత్రమే ప్రేమించిన పతివ్రతారత్నం కదా! నిజానికి నిన్ను ఎవరయినా చూడటమే నేను భరించలేను."

భార్యా భర్తలెవరయినా జీవితకాలమంతా ఇలా మాట్లాగలరు. వాళ్ళకు ప్రత్యేకంగా విషయమేమి అక్కర్లేదు. కానీ, జ్వరంతో బాధపడుతున్న సత్తయ్య విషయం మర్చిపోకూడదు కదా.

మందులూ, ఇంజక్షన్‌ల వలన అతని జ్వరం తగ్గింది కానీ, అది పూర్తిగా నయంకాలేదు. అప్పుడప్పుడూ పెరుగుతూ, తగ్గుతూ వచ్చింది. పది పదిహేను రోజుల తర్వాత డాక్టర్లు స్పష్టంగా చెప్పేశారు. సత్తయ్యకి పక్షవాతం వచ్చిందని.

ఈ లోపల సత్తయ్య ఆసుపత్రిలో చేరిన మరుసటి రోజు, జ్వరం కాస్త తగ్గగానే, కొడుకుని దగ్గరగా పిలిచి,

"బాబూ! నేను ఆఫీసులో చేసే పనంతా నీకు వివరంగా చెబుతాను. పెద్దయ్యగారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా నువ్వు చూసుకోవాలి. ఆయన ఇంట్లో కూడా ఏదయినా పని ఉంటే, నువ్వు వెళ్ళి చేసిరావాలి. నా ఈ జబ్బు వలన అయ్యగారికి కానీ, వారి ఇంటివారికి కానీ, ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూసుకో."

ఆపీసులో చేస్తున్న పనుల గురించి, కొడుకుతో మెల్లగా అతను వివరించాడు. తరువాత,

"పగలంతా మీ అమ్మ నా దగ్గరుంటుంది. సాయంత్రం నువ్వు వచ్చాక ఆమె ఇంటికి వెళుతుంది. ఉదయం, మళ్ళీ మీ అమ్మ వచ్చాక నువ్వు ఆఫీసుకు వెల్లవచ్చు. ఇప్పుడు నువ్వు ఆఫీసుకు వెళ్ళు. అయ్యగారు ఏం చెప్పినా, అలాగే నువ్వు చెయ్యాలి. ఆపీసులో ఉండవద్దని చెపితే నువ్వు ఒక సలాం పెట్టి వెనక్కి వచ్చేసెయ్యి" అని ఆదేశించాడు.

ఆనంద్ హెడ్డాఫీసుకు వెళ్ళి మల్లికార్జునరావుతో సత్తయ్య అభిప్రాయం గురించి చెప్పాడు.

"ఆనంద్! నీ తండ్రి స్థానంలో నువ్వు ఇక్కడ పనిచేయవలసిన అవసరంలేదు. ఇది గవర్నమెంట్ రూల్స్‌కి వ్యతిరేకం. మీ నాన్న ఇప్పుడు క్యాజువల్ లీవులో ఉన్నాడు. ఏదయినా అస్వస్థత, అసౌకర్యం లేదా ఏదయినా అత్యవసరమయిన పని పడేటప్పుడు తీసుకునే శెలవుకు క్యాజువల్ లీవ్ అని పేరు. సత్తయ్య మూడు. నాలుగు రోజులు రాకపోతే నాకు పెద్ద

అసౌకర్యమేమీ కలగదు. ఇక్కడ వేరే అటెండర్స్ ఉన్నారు కదా! నువ్వు హాస్పటల్‌కి వెళ్ళి సత్తయ్యకు సహాయంగా ఉండు" అని ఆ పెద్ద మనిషి ఉపదేశించాడు.

రెండు మూడు రోజుల కొకసారి ఆనంద్ ఆఫీసుకు వెళ్ళి, సత్తయ్య ఆరోగ్య పరిస్థితి గురించి మల్లికార్జునరావు గారికి తెలియజేసేవాడు.

సత్తయ్యని హాస్పటల్‌లో అడ్మిట్ చేసిన పదిరోజుల తరువాత, మల్లికార్జునరావు దగ్గరికి, ఆనంద్ వెళ్ళినపుడు దుఃఖంతో పూడుకుపోయిన కంఠంతో... "సార్! నాన్నగారికి జ్వరం తగ్గింది కానీ, ఆయన ఎడం చెయ్యి, ఎడం కాలూ పక్షవాతంతో పడిపోయాయి. అది నయం కాదని అక్కడి నర్సులందరూ చెబుతున్నారు.

అదే రోజు సాయంత్రం మల్లికార్జునరావు దంపతులు, ఆసుపత్రికి వెళ్ళి డాక్టర్స్‌తో మాట్లాడిన తరువాత సత్తయ్యని సందర్శించారు.

సత్తయ్య తన కుడిచేత్తో ఎడంచేతిని పైకెత్తి నమస్కారం పెట్టడానికి ప్రయత్నం చేసాడు. పక్కమీది నుండి లేవడానికి కూడా ఒక విఫల ప్రయత్నం చేసాడు. ఆశ్రిత ప్రియుడైన ఆ ఉన్నతాధికారి, నిస్సహాయ స్థితిలో ఉన్న సత్తయ్యని వారించి, మళ్ళీ మంచం మీద పడుకోబెట్టాడు.

"సత్తయ్యా! నువ్వేమీ బాధపడకు. నేను డాక్టరుతో మాట్లాడాను. వాళ్ళు నీకు మంచిమందులే ఇస్తున్నారు. రెండు, మూడు రోజుల్లో నీవు ఇంటికి వెళ్ళిపోవచ్చు. తరువాత మందులు మాత్రం సక్రమంగా వాడాలి. నీ జబ్బు నయం కావడానికి కొన్ని రోజులు పడుతుంది. కానీ, నువ్వు తప్పకుండా పూర్తిగా కోలుకుని ఆఫీసుకి తిరిగి వస్తావు."

కన్నీరు కారుస్తూ పడుకున్న సత్తయ్యకు, ఆ ఉన్నతోద్యోగిపట్ల ఉన్న భక్తి, కృతజ్ఞతా భావం వల్ల మాటలు గొంతులోనే ఆగిపోయాయి.

"సార్!..... ఈ విధంగా కదలకుండా పడుకోవడంలో నా కెలాంటి దుఃఖం లేదు. ఈ జన్మలో కానీ, పూర్వజన్మలో కానీ, నేను ఏదయినా పాపంచేసి ఉండవచ్చు. అకారణంగా దేవుడు ఎవరికీ ఇలాంటి శిక్ష విధించడు. ఈ రోగం నయమవ్వాలంటే, చాలా కాలంపడుతుందేమో, నేను తిరిగి ఆఫీసుకు వచ్చేవరకు, తమరు దయచేసి మా ఆనంద్‌ను అక్కడ పెట్టుకోండి" అని అభ్యర్థించాడు.

"సత్తయ్యా! నీ శెలవు సమయంలో నీ కొడుకు ఆనంద్ ఆఫీసుకి వచ్చి పనిచేయాల్సిన అవసరంలేదు. క్యాజువల్ లీవ్ అయినా కానీ మెడికల్ లీవు అయినా కానీ, ఎర్నెడ్ లీవ్

అయినా కానీ, అది నీ హక్కు. ఆనంద్ మోటార్ మెకానిజం నేర్చుకోవడానికి వెళుతున్నాడు కదా! అతను దాన్ని కొనసాగించడమే మంచిది. ఇంటి విషయాలు కూడా అతనే చూసుకోవాలి కదా! నా గురించి నీవేమీ బాధపడవద్దు. కరీముల్లా నన్ను బాగానే చూస్తున్నాడు.” అని మల్లికార్జునరావు అతనికి నచ్చచెప్పడానికి ప్రయత్నించాడు.

“సార్! తమరు నా విన్నపం ఒకసారి పరిగణించాలి. ఆనంద్‌కు మోటర్ మెకానిజంలో ఎలాంటి ఆసక్తిలేదు. మరే పని దొరక్క దానికి వెళ్ళాడు. తమరి దగ్గరుండి నేను చేస్తూ వచ్చిన పని నేర్చుకుంటే, ఎప్పుడయినా అలాంటి ఉద్యోగం దొరికితే బాగా చేయగలుగుతాడు. అందుకే, నేను తిరిగి వచ్చే వరకు తమరు ఇతనికి కొంచెం ట్రైనింగ్ ఇవ్వాలని నా మనవి. దాని వలన ఆనంద్‌కు మన ఆఫీసులో ఉద్యోగం రావడానికి హక్కేమీ ఏర్పడదని నాకు తెలుసు. ఆఫీసు నియమాల ప్రకారం, అలా పనిచేయించడం సక్రమం కాదని కూడా నాకు తెలుసు. కానీ, నేను పనేం చేయకుండా నెలనెలా జీతం తీసుకోవడానికి నా మనస్సు ఒప్పదు సార్! అన్ని కన్నీళ్ళతో సత్తయ్య చెప్పాడు.

“సత్తయ్యా! నువ్వు తీసుకొన్న శెలవూ, ఆ శెలవు కాలంలో నీకు వచ్చే జీతమూ, రెండు నువ్వు సంపాదించుకొన్నవే. నీకు లీవు తీసుకొనే అలవాటు ఎప్పుడూ లేదు కదా... ఎన్‌క్యాష్‌మెంట్ లీవు తప్ప అందుకే, నీ ఎకౌంట్‌లో చాలా లీవు మిగిలి ఉంది. ప్రభుత్వం నీకు ఫ్రీగా ఏమీ ఇవ్వడం లేదు.”

“సార్! నా కొడుకు మీ పాదసేవ చేస్తేనే నాకు మనశ్శాంతి కలుగుతుంది. అలాంటి మనశ్శాంతి కలిగితేనే నా జబ్బు నయమవుతుంది.”

మల్లికార్జునరావుకి సత్తయ్య మాట కాదనడానికి కారణమేమీ దొరకలేదు.

మర్నాటినుండి ఆనంద్ అటెండర్‌పని, అప్రెంటిస్ షిప్ మొదలు పెట్టాడు. అతి దయాళువైన ఆ ఆఫీసర్, అతన్ని రోజూ అతని తండ్రి ఆరోగ్య స్థితి గురించి అడిగి తెలుసుకునేవాడు; సాయంత్రం కొంచెం త్వరగా ఇంటికి వెళ్ళమని చెప్పేవాడు.

సత్తయ్యకు, ఈ పక్షవాతం రావడానికి ప్రత్యేక కారణమేదయినా ఉందా? గుడిశెలాంటి ఒక చిన్న స్వంత ఇల్లు ఉన్న అతను, ఒకరకంగా సంతృప్తికరమైన జీవితాన్ని గడిపేవాడు. నెల జీతం, ఇంటి ఖర్చులకి సరిపోకపోయినా, వాళ్ళెప్పుడూ పస్తులుండలేదు. ఆనంద్ అక్క విజయ, ఎనిమిదో తరగతి వరకు మాత్రమే చదివింది. ఆమె కన్నా అయిదేళ్ళు చిన్నవాడైన ఆనంద్‌కు, పదోక్లాసు పాసయిన తర్వాత కాలేజీకి వెళ్ళే అదృష్టం కలగలేదు. విజయకు పదిహేడు, పద్దెనిమిదేళ్ళ వయసు నుంచి సత్తయ్య సంబంధాలు చూస్తూనే ఉన్నాడు కాని,

ఆ పెళ్ళి కొడుకుల విపణిలో ధరలు అతనికి అందుబాటులో ఉండేవి కావు. రెండు, మూడు సంబంధాలు పెళ్ళి చూపుల వరకూ పురోగమించాయి. ఆ పెళ్ళి చూపులన్నీ విజయకు నైరాశ్యం, లోకంపట్ల ద్వేషం పెరగడానికి ఎరువు చేశాయి. ఇరవై నాలుగేళ్ళ వరకు తనని తాను ఏదో విధంగా తమాయించుకోగలిగింది. ఆమెకి ఇరవై అయిదేళ్ళు నిండేలోపల, పెళ్ళయ్యి, ఇద్దరు పిల్లలున్న పక్కింటి ఆటో రిక్షా డ్రైవరు మోహన్ యాదవ్‌తో లేచిపోయింది. తరువాత మూడు నెలలు సత్తయ్య, సత్తయ్య కొడుకు ఆనంద్, విజయ కోసం ఆంధ్రప్రదేశ్ అంతా గాలించారు. కానీ, ఫలితం మాత్రం శూన్యం. భార్య నిరంతరరోదనం అతడిని మరింత దుర్బలుడ్ని చేసింది. ఇదిలా ఉండగా, పక్కింటి మిసెస్ యాదవ్‌కు తన భర్త పక్కింటమ్మాయితో లేచిపోవడం వరంగానే పరిణమించింది. ఆటోరిక్షా ఆమె పేరుమీద ఉంది. మోహన్ యాదవ్ అయితే రోజూ వచ్చే రాబడిలో సగం తాగుడుకే ఖర్చుపెట్టేవాడు. దాని గురించి రోజూ ఆ ఇంట్లో గొడవలు జరిగేవి. విజయకు సంభవించబోయే దుర్భర భవిష్యత్తు గురించి, ఆమె చెబుతూ వుంటే లక్ష్మమ్మకు పట్టలేని దుఃఖం కలిగేది. "యాదవ్యం కంటే వైదవ్యం మేలని" ఆమిసెస్ ఆటో అభిప్రాయపడేది.

తండ్రి స్థానంలో పనిచేయడం మొదలు పెట్టిన ఆనంద్ మల్లికార్జునరావుకు మాత్రమే కాక, మొత్తం ఆఫీసు వారందరికి కూడా చాలా నచ్చాడు. అప్పుడప్పుడు, ఆఫీసర్‌గారింటికి వెళుతూ ఉండటం వలన ఆయన భార్యకు కూడా సదభిప్రాయం కలిగింది.

నెలజీతం ఆనంద్ తీసుకున్నా, అది ముట్టినట్లు సత్తయ్యే మంచం మీదనుండి సంతకం చేసేవాడు. నాలుగైదు నెలల్లో సత్తయ్య చేసే పనులన్నీ నేర్చుకోవడమే కాక, అతని సంతకం చేయడం కూడా నేర్చుకున్నాడు. దానితో శయ్యావలంబియైన సత్తయ్యకు, ప్రతి నెలా కష్టపడి మంచం మీద నుండి సంతకం పెట్టే బాధ కూడా తొలగిపోయింది. జీతం మాత్రమే కాకుండా, శాఖాధికారిని కలవడానికి వచ్చే ఉద్యోగులు, సందర్శకులు, సంతోషంతో ఇచ్చే చిన్న చిన్న బరొాతములను కూడా ఆనంద్ వినయంతో వందనాలు చేస్తూ స్వీకరించేవాడు. సత్తయ్య చికిత్స విషయంలో ఆఫీసువాళ్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న కారణంగా, చికిత్సకు అయ్యే ఖర్చులన్నీ ప్రభుత్వమే భరించింది.

లక్ష్మమ్మ తన భర్తకు మనస్ఫూర్తిగా చేసే పరిచర్యలతో తన జన్మ సఫలమైందని భావించింది. ఇంగ్లీషు మందులతోపాటు ఆయుర్వేద లేపనాలు, కషాయాలు కూడా ఇచ్చినా సత్తయ్య పక్షవాతానికి మాత్రం ఎటువంటి ఉపశమనం కలగలేదు. ఒంటరిగా ఉన్నప్పుడు తను పెన్షన్ తీసుకోబోయే రోజులు దగ్గరపడుతున్నాయని, ఆ తరువాత ఇంటి ఖర్చులు తట్టుకోవడమెలా అని ఆలోచించి కన్నీరు కారుస్తూ ఉండేవాడు. ఆ లోపల అబ్బాయికి ఒక

ఉద్యోగం వస్తే ఎంత బాగుంటుంది! కనీసం తనైనా వెళ్ళిపోతే ఇంట్లో ఖర్చులు ఆమేరకు తగ్గుతాయి కదా!

మంచం మీద నుంచి లేవలేకపోయినా భర్త అనే ఒక వ్యక్తి ఇంట్లో ఉండటం గురించి లక్ష్మమ్మకు కొంచెం ఊరడింపుగా ఉండేది. భర్త కోలుకోవడానికి ఆమె నోచని నోములు, చెయ్యని పూజలంటూ ఏమీ లేవు.

సంవత్సరం పాటు, ఎన్ని చికిత్సలు చేసినా, అతని పరిస్థితి ఏమాత్రం మెరుగు పడకపోవడంతో, లక్ష్మమ్మకు, ఒక విధమైన ఆందోళన ఆమె మనస్సును తినేయడం మొదలు పెట్టింది. భగవంతుడా! ఈ జీతమే సరిపోవడం లేదంటే, రిటైరయితే ఆ వచ్చే పెన్షన్ డబ్బులతో ఇల్లు ఎలా గడుస్తుంది! రిటైరయ్యాకా ప్రభుత్వం నుంచి చికిత్సకోసం ఇంతవరకూ వస్తున్న సహాయం కూడా ఆగిపోతుందేమో!

ఒక శెలవు రోజు ఆమె మల్లికార్జునరావు ఇంటికి వెళ్ళి తన బాధలనన్నింటినీ ఏడుస్తూ వివరించింది. సత్తయ్య ఉద్యోగవిరమణ తరువాత, ఆ ఉద్యోగం ఆనంద్‌కి ఇస్తే, తమ కుటుంబం పస్తులుపడే దుర్గతి రాకుండా ఉండవచ్చని ఆమె మనవి చేసింది. అలా ఇవ్వడానికి వీల్లేదని ఆయన ప్రభుత్వ చట్టాల గురించి వివరించాడు. ఒక ప్రభుత్వోద్యోగి ఏదయినా నయం కాని రుగ్మత కారణంగా రిటైర్మెంట్ తేదీకి మూడు సంవత్సరాల ముందు వాలంటరీ రిటైర్మెంట్ తీసుకుంటే, అతని కొడుక్కి కానీ, కూతురికికానీ, తగిన విద్యాభ్యాస అర్హతలుంటే, వారికి ఆ రిటైర్మెంట్‌కు ముందు ఎవరయినా చనిపోతే, వారి పిల్లలలో ఒకరికి వారి వారి విద్యాభ్యాస యోగ్యతలను బట్టి ఉద్యోగం ఇవ్వడానికి అవకాశముందని కూడా చెప్పాడు. సత్తయ్య రిటైరయ్యేలోగా, ఆనంద్‌కి ఏదైనా ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం కోసం ప్రయత్నిస్తానని, లక్ష్మమ్మకు కొంత ఊరట కలిగించే ఉద్దేశంతో అతను హామీ ఇచ్చాడు.

నెలలు అలా గడిచిపోయాయి. సత్తయ్య కార్చే కన్నీరు రోజురోజుకు ఎక్కువ అవుతూ వచ్చింది. తను రిటైరయిపోతే, ఇక ఆనంద్ ఆఫీసులో అడుగు పెట్టడానికి వీలుండదు, ఆ వచ్చే పెన్షన్ డబ్బులతో, ఇంటి ఖర్చులు భరించడం కష్టం. ఈలోగా ఆనంద్‌కు మరో ఉద్యోగం దొరికే అవకాశాలు కూడా లేవని రాత్రి పగలూ ఆలోచించి సత్తయ్య కలత చెందని సమయమే లేదు.

"లక్ష్మీ! నేనొక మహాపాపిని కావడంవల్లే ఈ రోగం వచ్చింది. అది తగ్గకుండా నన్ను సతాయిస్తూ ఉంది. రిటైరయ్యే ముందే, ఆ దేవుడు నన్ను పిలిపించుకుంటే మన కుటుంబం బతికిపోతుంది. ఆ మాత్రం దయ దేవుడు నామీద చూపిస్తే చాలు. కానీ, ఈ విషయంలో

కనక ఆయన ఇంకా ఆలస్యం చేస్తే చాలా అన్యాయం జరిగిపోతుంది" అంటూ అతను వెక్కి వెక్కి ఏడ్చాడు.

లక్ష్మమ్మ కూడా ఏడవకుండా ఉండలేకపోయింది. "ఈ జబ్బు నయమవడం గురించి మీరు ఎందుకంత ఆందోళన పడుతున్నారు? మీరిలా మాట్లాడితే నా గుండె ముక్కలైపోతుంది. నాకు మీకన్నా ముందే పోవాలని ఉంది. ఏ స్త్రీ అయినా సుమంగళిగానే పోవాలని కోరుకుంటుంది. కానీ, ఈ ఇంట్లో నుంచి నేను ముందు వెళ్ళిపోతే మిమ్మల్ని చూసేదెవరు? అందుకే, బతికినంతకాలం కలిసి బతుకుదాము. పోయేటపుడు కూడా కలిసే పోదాము. మీరు లేకుండా ఒక్కరోజు కూడా నేను జీవించలేను. ఏదయినా కానీయండి. జరగబోయేదాన్ని ధైర్యంగా ఎదుర్కొందాము. పస్తులుండాల్సిన పరిస్థితే వస్తే అందరం కలిసి పస్తులుందాము. ఆనంద్‌కి ఏదో ఉద్యోగం దొరక్కపోదు. ఏదైనా ప్రైవేట్ కంపెనీలో ఇప్పిస్తానని మీ సార్ మాట ఇచ్చారు అశుభం మాటలు పలకకండి బాబూ!" అని లక్ష్మమ్మకు భర్తకు నచ్చచెప్పింది.

"ఏమయినా ప్రస్తుతం నేను ఈ లోకానికే భారంగా ఉన్నాను. మొదట్లో ఈ జబ్బు మూడు నెలల్లో తగ్గుతుందని మనమందరం అనుకున్నాము. ఇప్పుడు ఒక సంవత్సరంపైనే అయిపోయింది. ఇక ఇది నయమయ్యే అవకాశం కూడా లేదు. నా వయసెంతనుకుంటున్నావు? అరవై ఏళ్ళవరకు బతికితే అది అదృష్టమనే చెప్పాలి. ఈ రోజుల్లో పెద్ద పెద్ద డాక్టర్లు కూడా నలభై ఏళ్ళకి, యాభై ఏళ్ళకి పోవడం మామూలైపోయింది."

"కానీ, మీరు ఇంకా రిటైర్ అవలేదే...."

"అదే... ఉద్యోగం కోసం మూడు నాలుగు సంవత్సరాలు తక్కువ రాశాను. ఆ విషయం నీకు కూడా తెలుసు కదా!"

"అంటే, మీకు యాభై ఎనిమిది ఇంకా నిండలేదు, అదే మీ సరియైన వయసు."

"కాదు లక్ష్మీ! కాదు, ఒక ఏడాది కిందట నా వయసు యాభై ఆరు. కానీ, అప్పుడు నాకు ఒక నలభై అయిదేళ్ళ వాడిలా గుండెధైర్యం ఉండేది. అలాంటి ఆరోగ్యం నాకు ఈరోజు ఉండుంటే వంద ఏళ్ళ వరకూ బతకాలని నేను చెప్పేవాణ్ణి. ఉద్యోగ విరమణ తరువాత కూడా ఏదో ఒకపనిచేసి నాలుగురాళ్ళు సంపాదించేవాడిని. కానీ, పోయిన ఏడాది నుండీ నేను ఒక జీవచ్ఛవంలా పడుకుని ఉన్నాను కదా! ఈ రోజు నీ సహాయం లేకుండా, నిన్ను ఇబ్బంది పెట్టకుండా, నేను ఏదైనా చేయగలనా? నాచేత్తోనేను మంచినీళ్ళు తీసుకుని తాగేశక్తి కూడా నాలకు లేదు. ఈ పరిస్థితిలో ఎక్కువ కాలం బతకడం నాకు హాయిగా ఉంటుందని అనుకుంటున్నావా? ఈ విధంగా నేను ఇంకా కొంతకాలం మంచానపడుంటే,

నీకేదైనా ప్రయోజనం ఉందా? విజయకు నేను ఇంకా చాలా కాలం బతకాలనే ఉండవచ్చు. దానికి కారణమేమిటో తెలుసా? నేను సంవత్సరం నుంచి అనుభవిస్తున్న ఈ నరకయాతన ఆమెకు తెలియదు. మోహన్‌యాదవ్ ఆమెను ఈపాటికి సతాయించడం మొదలుపెట్టే ఉంటాడు. ఇంకా కొంతకాలం అతని తిట్లు, దెబ్బలు తిన్న తరువాత, ఆమె తిరిగి మన దగ్గరికే వచ్చేస్తుంది. తరువాత, మన అబ్బాయి విషయానికొస్తే, వాడికి నేనంటే ప్రాణం. కానీ, సగం ప్రాణం ఇగిరిపోయిన నా కొరకు వాడింకా ఎంతకాలం కష్టపడాలి? మీరిద్దరు నన్నెప్పుడూ ద్వేషించరని నాకు బాగా తెలుసు. కానీ, నన్ను నేను ద్వేషించుకుంటున్నాను. అందరికీ భారంగా, చీదరగా ఉపయోగ శూన్యంగా బతుకుతున్న నాపైన నాకే రోత పుడుతోంది. నేనింకా ఎక్కువ కాలం బతకడం వల్ల ప్రయోజనమేమయినా ఉందా? నా ఆరోగ్య పరిస్థితి మునుపటిలా చక్కబడుతుందని కలలో కూడా ఆశించడానికి వీల్లేదు. నా జీవితయాత్ర చరమాంకానికి చేరింది. పరిగెత్తడం కాక, కనీసం నడవడమైనా చేతకాక పాకుతూ వెళ్ళడాన్ని "యాత్ర" అనడం క్రౌర్యం కాదా! అది అపహాస్యం కాదా! ఇలా పాకుతూ సాగే నా పయనం ఎంత త్వరగా ఆగితే అది నాకు ముక్తి. మీ ఇద్దరికి విముక్తి"

సత్తయ్య అభిప్రాయాలన్నిటినీ లక్ష్మమ్మ ఆనంద్‌తో చర్చించింది. వారిద్దరూ కలిసి కొంతసేపు ఏడ్చారు.

"అమ్మా! నాన్నగారు చెప్పే ప్రతి అక్షరమూ నిజమే. కానీ, ఈ విషయములో మనమేం చెయ్యగలం? జనన మరణాలను నిర్ణయించేది ఆ భగవంతుడే కదా! ఈ రోగానికి ఉపశమనం కలిగించాలని కానీ, ఈ యాతనల నుంచి ఆయనకి విమోచనం ప్రసాదించాలని కానీ, ఆ దేవుణ్ణి కోరడం తప్ప మనమేం చేయగలం?

"ఏంట్రా నువ్వనేది? తండ్రి చావు గురించి, దేవుణ్ణి ప్రార్థిస్తావా? నిజం చెప్పరా, నువ్వు అలా చేయగలవా?"

"లేదమ్మా, అది నా వల్లకాదమ్మా" అంటూ అతను తల్లిని గట్టిగా పట్టుకొని భోరున ఏడ్చేశాడు.

మరిన్ని రోజులు పండుటాకుల్లా రాలిపోయాయి. సత్తయ్య ముఖం మరింత వివర్ణంగా, నిర్లిప్తంగా, నిర్జీవంగా అవుతూ వచ్చింది. లక్ష్మమ్మకు భవిష్యత్తు గురించి భయం పెరుగుతూ వచ్చింది. ఆనంద్ పిచ్చివాడిలాగా తయారయ్యాడు. అతని కళ్ళల్లో అంధకారం పేరుకుపోయింది.... చెమచేరిన చీకటి.....

సత్తయ్య చివరి నెల జీతం రావడానికి ఇంకో వారం అంటే ఏడు రోజులు మిగిలి ఉండగా...

ఆ పక్షవాత రోగి మరణించాడు. ఆరోజు సూర్యాస్తమయానికి ముందే శవదహనం జరిగిపోయింది. హెడ్డాఫీసులో పనిచేస్తున్న మగవారందరూ స్మశానానికి చేరారు. సత్తయ్య అంతిమయాత్ర, ధూమపటలాలుగా స్వర్గారోహణ ప్రభుత్వ ఖర్చుతో జరిగింది. అదృష్టవంతుడు!!! ఆఫీసు ఉద్యోగ బృందం తరపున పూలమాలలు, మల్లికార్జునరావు గారి పూలచక్రం... అగ్నికీలల క్షుదార్తిని తీర్చేందుకు వెంపర్లాడుతున్న ఆ ధన్యకళేబరాన్ని అలంకరించింది.

మల్లికార్జునరావుగారు తీసుకున్న ప్రత్యేక శ్రద్ధ కారణంగా ఆనంద్ మరుసటి నెల మొదటి తారీఖున అదే ఆఫీసులో అటెండర్‌గా చేరగలిగాడు.

సత్తయ్య ఆత్మ ఆనందాతిరేకంతో పులకరించి ఉంటుంది!

కానీ, కొడుక్కి ఉద్యోగం రావడం పట్ల లక్ష్మమ్మకి ఎందువల్లో కానీ, అటువంటి ఆనందాతిరేక ప్రాప్తి సాధ్యం కాలేదు. సత్తయ్య మరణానికి ఒక రోజు ముందే, ఆమె మౌనసముద్రంలో మునిగిపోయింది... ఆమె వదనాన్ని ఒకవిధమైన అప్రశాంత గంభీరత ఆవరించింది.

సత్తయ్య మృతదేహంపై పడి ఆమె ఏడవలేదు. ఆమె కళ్ళ నుంచి ఒక అశ్రుకణం కూడా జారిపడలేదు. ఏం చేద్దాం... ఆ కళ్లల్లో వేడికన్నీరు ఏమాత్రం మిగల్లేదేమో.

కానీ, ఆనంద్ దయనీయ రోదన మాత్రం, ఒక బాలవితంతువు నుంచి వచ్చినట్టు ధ్వనించింది.

రాయడం, చదవడం తెలియని లక్ష్మమ్మకు యూథనేసియా లేక మెర్సీకిల్లింగ్ అనే పదాల అర్థానికి తాత్పర్యం తెలుసో లేదో !!!!